క్లుప్తంగా

జాతీయ స్కేటింగ్ పోటీలకు చిన్నారులు



స్కేటింగ్‌లో పతకాలు సాధించిన విద్యార్థులు

ప్రకాశం నగర్: తిరుపతిలో ఇటీవల జరిగిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్కేటింగ్ టోర్నమెంట్‌లో దానవాయిపేట గాంధీ పార్కు స్కేటింగ్ విద్యార్థులు పలు విభాగాల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కోచ్ కెల్లా రాము మంగళవారం ప్రకటనలో తెలిపారు. అండర్ – 11 ఇన్‌లైన్ బాలుర విభాగంలో కార్తిక్ బ్రాంజ్ మెడల్, అండర్ – 14 ఇన్‌లైన్ బాలికల విభాగంలో కె.భవ్యశ్రీ మూడు బంగారు పతకాలు, అండర్ – 14 బాలుర విభాగంలో జి.శ్రీవత్సవ్ నాలుగు వెండి,ఒక బ్రాంజ్ పతకం, అండర్ – 17 బాలికల విభాగంలో ఎండీ ముదుసరున్నీసా ఒక వెండి, ఒక బ్రాంజ్ పతకం సాధించారన్నారు. వీరందరూ ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకూ మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొంటారన్నారు.

42 మంది వలంటీర్ల రాజీనామా



ఎంపీడీవో రాజ్‌మనోజ్‌కు రాజీనామాలు అందిస్తున్న వలంటీర్లు

కడియం: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 42 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్‌కు అందజేశారు. పేదలు, వృద్ధులు, వికలాంగులకు సేవలందిస్తున్న తమపై అకారణంగా నిందలు వేస్తూ, ఉగ్రవాదులతో పోల్చడంపై మనస్థాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు కొందరు తమ లేఖల్లో పేర్కొన్నారని ఎంపీడీవో తెలిపారు. అలాగే మరి కొందరు తమ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు లేఖ ఇచ్చారన్నారు. రాజీనామా చేసిన వారిలో మాధవరాయుడుపాలేనికి చెందిన 32 మంది, దామిరెడ్డిపల్లి, వేమగిరి, కడియం గ్రామాలకు చెందిన వలంటీర్లు ఉన్నారన్నారు. ఇప్పటి వరకూ మండల వ్యాప్తంగా 54 మంది రాజీనామాలు చేశారని ఎంపీడీవో తెలిపారు.

ముందస్తు అనుమతి తప్పనిసరి

కంబాలచెరువు: ఎన్నికల కోడ్ నేపథ్యంలో సెక్షన్ 144, సెక్షన్ 30 అమలు ఉన్నాయని, ఎటువంటి కార్యకలాపాలకైనా పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సౌత్ జోన్ డీఎస్పీ కె.విజయ్ పాల్ మంగళవారం తెలిపారు. సువిధ యాప్ ద్వారా ఎన్నికల ప్రచారాలు, జాతరలు, బహిరంగ సభలు, సమావేశాలకు సంబంధించి మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సింగిల్ విండోలో ఆన్‌లైన్ ద్వారా, నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లౌడ్ స్పీకర్ ఏర్పాటు, స్ట్రీట్ కార్నర్ మీటింగ్, ఇంటింటికి ప్రచారం, ఊరేగింపు, ర్యాలీకి లౌడ్ స్పీకర్, బ్యానర్, జెండాల ప్రదర్శన, ఎయిర్ బెలూన్లు, హెలికాప్టర్, హెలిప్యాడ్, వాహన అనుమతి, వాహనానికి లౌడ్ స్పీకర్ అనుమతికి ముందస్తు అనుమతి తప్పనిసరి అన్నారు. అనుమతి లేకుండా కార్యక్రమాలు నిర్వహిస్తే ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పోలీసు అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. అలాగే ప్రచార సమయంలో బాణసంచా కాల్చడం పూర్తి నిషిద్ధమన్నారు. అభ్యర్థులు, మద్దతుదారులు బాణసంచా వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భూసార పరీక్షలపై అవగాహన



భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఆత్మప్రాజెక్టు డైరెక్టర్ జ్యోతిర్మయి

రాజమహేంద్రవరం రూరల్: భూసార పరిరక్షణ, భూసార పరీక్షలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ వై.జ్యోతిర్మయి అన్నారు. ఓఎన్‌జీసీ కేంద్రీయ విద్యాలయంలో మంగళవారం విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మట్టి నమూనాలు, ప్రయోజనాలు, ఆవశ్యకతపై రాజమహేంద్రవరం మండల వ్యవసాయాధికారి ఏ.భీమరాజు వివరించారు. తొర్రేడులో కేవీ ఆధ్వర్యంలో మట్టి నమూనాలు రైతుల నుంచి సేకరించి అనంతరం ఫలితాలపై రైతులకు వివరిస్తున్నామని ఏరువాక జిల్లా శాస్త్రవేత్త సీహెచ్‌వీ నరసింహారావు తెలిపారు. కేవీ ప్రిన్సిపాల్ వర్షా జైన్, కేవీకే శాస్త్రవేత్త సత్యవేణి, ఏడీఏలు డి.శ్రీనివాసరెడ్డి, జయరామలక్ష్మి, వ్యవసాయాధికారి శాంతా ఆలివ్ పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

ప్రకాశం నగర్: శారద మాత రాజమహేంద్రవరాన్ని సందర్శించి 113 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రామకృష్ణ మఠం ఆధ్వర్యంలో మంగళవారం 200 మంది వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కోరుకొండ రోడ్డులోని రామకృష్ణ మఠంలో స్వామి పరిజ్ఞేయానంద చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. అంతకు ముందు పుష్కర ఘాట్‌లోని శారదామాత మంటపంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్వామి వేదవిద్యానందజీ, స్వామి రఘువీర నందజీ పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డుతో ప్రమాదాలకు చెక్

- 800 మీటర్లు నిర్మిస్తున్న డీమార్ట్ యాజమాన్యం
- శరవేగంగా పనులు



హుకుంపేటలో హైవే పక్కన నిర్మిస్తున్న సర్వీసు రోడ్డు



శరవేగంగా జరుగుతున్న పనులు

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసిన డీమార్ట్ షోరూమ్‌కు ప్రజలు, వాహనచోదకులు రాంగ్‌రూట్‌లో వెళ్లాల్సి వచ్చేది. దీనివల్ల ప్రమాదాలతో పాటు పోలీసులు అపరాధ రుసుములు విధించేవారు. ఈ ఇబ్బందులకు ఇప్పుడు చెక్ పడనుంది. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఆఫ్ ఇండియా అనుమతితో డీమార్ట్ యాజమాన్యం సుమారు 800 మీటర్ల మేర రూ.2 కోట్లతో సర్వీసు రోడ్డు నిర్మాణం చేపడుతోంది. ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

వివరాలు ఇవీ..

హుకుంపేట జాతీయ రహదారి పక్కన డీమార్ట్‌తో పాటు నివాస గృహాలు, ఎంపీడీవో, విద్యాశాఖాధికారుల కార్యాలయాలు, చిరు వ్యాపార దుకాణాలు ఉన్నాయి. డీమార్ట్‌కు రోజూ వేలమంది వినియోగదారులు వస్తుంటారు. వీరు హుకుంపేట సెంటర్‌కు మోరంపూడి జంక్షన్‌కు వెళ్లి, తిరిగి రావాలంటే కిలోమీటరన్న దూరం ఎక్కువ అవుతోంది. దీంతో కొందరు రాంగ్‌రూట్‌లో ప్రయాణం సాగిస్తున్నారు. దీనివల్ల ఒక్కోసారి ప్రమాదాలు జరిగి మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. అలాగే పోలీసులు సైతం రాంగ్‌రూట్‌లో వచ్చిన వాహనాలకు అపరాధ రుసుము విధిస్తున్నారు.

సర్వీసు రోడ్డు నిర్మాణం

డీమార్ట్ యాజమాన్యం సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టాలన్న ఉద్దేశంతో నేషనల్ హైవే ఆఫ్ అథారిటీ ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి అనుమతులు తీసుకున్నారు. రూ.2 కోట్లతో సుమారు 800 మీటర్ల మేర సర్వీసు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. త్వరలోనే రోడ్డు నిర్మాణం పూర్తిచేసేలా శరవేగంగా పనులు చేపడుతున్నారు. ఈ సర్వీసు రోడ్డు నిర్మాణం జరిగితే డీమార్ట్‌కు వచ్చే వినియోగదారులతో పాటు, ఎంపీడీవో, విద్యాశాఖాధికారి కార్యాలయాలకు వచ్చే అధికారులు, ప్రజలకు, ఆ ప్రాంతంలో నివసించే వారికి ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది. రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గుతాయి. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో సర్వీస రోడ్డును డీమార్ట్ యాజమాన్యం నిర్మిస్తోంది.

ఎంతో ప్రయోజనం

హుకుంపేట జాతీయ రహదారిపై డీమార్ట్ వద్ద సర్వీసు రోడ్డు నిర్మించడం వల్ల రాకపోకలకు ఎంతో సులభంగా ఉంటుంది. రాంగ్ రూట్‌లో వాహన చోదకులు రావడం వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వీసు రోడ్డు నిర్మాణంతో ఎటువంటి ప్రమాదాలు జరగవు.

– కొవ్వూరి ధర్మారెడ్డి, సామాజిక కార్యకర్త, హుకుంపేట

మర్యాదపూర్వకంగా..



శైలేంద్రరావును సత్కరిస్తున్న రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శిగా నియమితులైన చాగల్లు మండలం చంద్రవరం గ్రామానికి చెందిన గుమ్మడి శైలేంద్రరావు మంగళవారం రాజమహేంద్రవరంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రౌతు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం శైలేంద్రరావును సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రాబ్యాంకు పూర్వపు సీనియర్ మేనేజర్ ఎం.ఆదాము రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

కడియం: మురమండ 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ హెడ్ క్వార్టర్ ఫీడర్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ డి.శ్రీధర్ వర్మ తెలిపారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ గృహాలకు, ఉదయం 8 నుంచి సాయంత్రం 5 వరకు వ్యవసాయ బోర్లకు సరఫరా ఉండదన్నారు.

చెల్లుబోయిన వేణు విజయానికి కృషి



మాజీ ఎంపీ వెంకటస్వామి నాయుడితో మంత్రి వేణు, పార్టీ నాయకులు

కడియం: రూరల్ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామి నాయుడు అన్నారు. ఆయన కడియంలో మంగళవారం మంత్రి వేణు మంగళవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. స్థానిక పరిస్థితులపై సమాలోచనలు చేశారు. అనంతరం గిరజాల మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయం ప్రజలకు అత్యంత అవసరమన్నారు. జగన్ ఆదేశాలతో రూరల్ నుంచి పోటీలో నిలిచిన వేణును గెలిపించుకుని నియోజకవర్గం అభివృద్ధికి అందరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు నాయుడి కుయుక్తుల కారణంగా వృద్ధులు, వికలాంగులు పెన్షన్లు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలను ఇబ్బందులు పెట్టే ఇటువంటి చర్యలు చంద్రబాబుకు తగవని హితవు పలికారు. అంతకు ముందు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులను మంత్రి వేణుకు గిరజాల పరిచయం చేశారు. కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, పార్టీ నాయకులు గిరజాల బాబు, నక్కా రాజబాబు, దుళ్ల ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్లు వెలుగుబంటి అచ్యుతరామ్, తిరుమలశెట్టి శ్రీను, మాజీ సర్పంచ్ దాసరి శేషగిరి, బత్తుల రాము, నందపునీడి గంగారావు, సర్కార్‌బాషా పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెరిగేలా కార్యాచరణ



పొట్టిలంకలో వృద్ధురాలి నుంచి హోం ఓటింగ్‌కు అంగీకార పత్రం తీసుకుంటున్న ఆర్వో తేజ్‌భరత్

కడియం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని రూరల్ ఆర్వో తేజ్‌భరత్ ఆదేశించారు. ఆయన మంగళవారం పొట్టిలంక గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హోం ఓటింగ్ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. 85 ఏళ్లు ఉన్న ఓటర్లు, 40 శాతం డిజెబిలిటీ ఉన్న దివ్యాంగ ఓటర్ల నుంచి హోం ఓటింగ్ కోసం ధ్రువీకరణ పత్రాలు, ఫారం 12డి స్వీకరిస్తున్నామన్నారు. వీరందరూ ఇంటి వద్దే ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 267 పోలింగ్ కేంద్రాలలో 1,346 మంది 85 ఏళ్లు పైబడిన ఓటర్లు, 2,435 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారన్నారు. పొట్టిలంకలోని 236 నంబర్ పోలింగ్ స్టేషన్ పరిధిలో 85 ఏళ్లు పైబడిన ఓటర్లు ఐదుగురు, 19 మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రం పరిధిలోని రేముళ్ల సుందరమ్మ (89), దివ్యాంగ ఓటరు నిర్మల నుంచి 12డి ఫారాలను జేసీ తేజ్ భరత్ స్వీకరించారు.

తనిఖీలు సక్రమంగా నిర్వహించాలి

సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేలా, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా చూసుకోవడంలో ఫ్లయింగ్ స్క్వాడ్, చెక్ పోస్ట్ బృందాలు కీలకంగా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ అన్నారు. కలెక్టర్ కె.మాధవీలత ఆదేశాల మేరకు ఆయన మంగళవారం పొట్టిలంక వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెక్ పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలన్నారు. ప్రతి రోజు నిర్దేశించిన లక్ష్యాల మేరకు తనిఖీలు నిర్వహించాలని, అనుమానం కలిగిన వారిపై మరింత దృష్టి సారించాలన్నారు. వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. వాహనాలు, రవాణా వ్యవస్థ, వ్యక్తుల కదలికలపై నిఘాను మరింత ఎక్కువ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ బి.రమాదేవి, కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్, డీటీ సుధీర్ ఉన్నారు.

496 మందికి వైద్యసేవలు



శిబిరంలో వైద్యసేవలపై ఆరా తీస్తున్న డాక్టర్ సుధాకర్

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు సచివాలయం–1 పరిధిలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష 2.0 వైద్యశిబిరంలో 496 మందికి వైద్యసేవలు అందించారు. ముగ్గురిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యులు జి.రోహిత, గైనకాలజిస్ట్ హనీలా, ఆర్థోపెడీషియన్ రామిరెడ్డి, ఆప్తాలిక్ ఆఫీసర్ సాంబయ్య రోగులకు పరీక్షలు నిర్వహించారు. శిబిరాన్ని ధవళేశ్వరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.సుధాకర్ పరిశీలించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జేగురుపాడులో 342 మందికి

కడియం: జేగురుపాడులో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 342 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు శిబిరం పర్యవేక్షణాధికారి డాక్టర్ ఎస్. నాగసాయిమౌర్య తెలిపారు. వీరిలో 42 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి, ఇద్దరిని ఆరోగ్యశ్రీకి రిఫర్ చేశామన్నారు. ప్రభుత్వ వైద్యులు మణిజ్యోత్స్న, సాయి హాస్పటల్స్ డాక్టర్ గౌతమ్ వర్మ, రాజమండ్రి హాస్పటల్స్ కె.ప్రణయ్, కడియం సీహెచ్‌సీ ఆప్తాల్మిక్ టెక్నీషియన్ కె.రాజేష్ వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.శిరీష పాల్గొన్నారు.

లేఅవుట్ ఆక్రమణపై అధికారులు స్పందించాలి



లేఅవుట్‌లో గోడ కట్టేందుకు చేస్తున్న సన్నాహాలు

రాజానగరం: గ్రామంలోని పాత జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సూర్యారావుపేటలో కొత్తగా వేసిన లేఅవుట్‌లో జరుగుతున్న ఆక్రమణలపై ప్రశ్నిస్తే.. సంబంధిత వ్యక్తులు గోడే కట్టిస్తామంటూ నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని ఆ ప్రాంతానికి చెందిన ఎస్సీ నాయకుడు ముప్పిడి శ్రీను ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లేఅవుట్ ఏరియా పూర్తిగా పల్లపు ప్రాంతం కావడమే కాకుండా అధిక వర్షాలకు పైగ్రామాల నుంచి ముంపు నీరు వచ్చి చేరుతుందన్నారు. ఇందుకు వీలుగా పక్కనే ఉన్న చాగల్నాడు కాలువపై నుంచి ర్యాంప్ కూడా నిర్మించారన్నారు. అయితే ఈ లేఅవుట్ యజమాని తన వ్యాపారం కోసం ఇప్పటికే పుంత మార్గాన్ని ఆక్రమించి, పక్కా రోడ్డు మార్గంగా చూపడంతో పాటు ఈ ర్యాంప్‌ని కూడా కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

నాయీ బ్రాహ్మణులలో రాజకీయ చైతన్యం



నాయీ బ్రాహ్మణుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్



మహిళతో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్

- నగరంలో అభివృద్ధి కనిపిస్తేనే ఓటెయ్యండి
- ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం సిటీ: నాయీ బ్రాహ్మణులలో మరింత రాజకీయ చైతన్యం రావాల్సిన అవసరం ఉందని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక వీవీ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన నాయీ బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చంద్రబాబు తన నోటి దురుసుతనంతో ప్రతి సామాజిక వర్గాన్ని ఏ విధంగా అవమానించారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. తోకలు కత్తిరిస్తామని, ఆ కులంలో పుట్టాలని ఎవరైనా అనుకుంటారా తదితర అనుచిత వ్యాఖ్యలతో రాష్ట్ర ప్రజల ఆగ్రహానికి గురయ్యారన్నారు. ఇటువంటి నేతలు వారి స్వలాభాన్ని చూసుకుంటారే తప్పిస్తే రాష్ట్రానికి చేసేదేమీ ఉండదన్నారు. ముఖ్యమంత్రి జగనన్న పేదల సంక్షేమానికి రూ.లక్షల కోట్లు వెచ్చిస్తూ, అనేక సంక్షేమ పథకాలతో పేదల గుండెల్లో చోటు సంపాదించుకున్నారన్నారు. పేదల అవసరాలు, కష్టాలు, అవస్థలు జగనన్నకు తెలుసునన్నారు. జనాభా దామాషా ప్రకారం ప్రతి సామాజిక వర్గం చట్ట సభలలో అడుగు పెట్టాలనేదే సీఎం జగనన్న ఆశయమన్నారు. నాయీ బ్రాహ్మణులు కూడా రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో అభ్యున్నతి సాధించాలన్నారు. ఆదిరెడ్డి కుటుంబం ఏకంగా 16 సంవత్సరాలు మేయర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పదవులు అనుభవించినా, రాజమండ్రి నగరానికి చేసిన మేలు శూన్యమన్నారు. ఎంపీగా ప్రజలు తనకిచ్చిన అవకాశాన్ని నగర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే నగరం రూపురేఖలు సమూలంగా మారుస్తానన్నారు. నగరంలో అభివృద్ధి జరిగిందని భావిస్తేనే తనకు ఓటెయ్యాలని కోరారు. సమావేశంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, బీసీ జేఏసీ చైర్మన్ మార్గాని నాగేశ్వరరావు, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, అజ్జరపు వాసు, అందనాపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు దారుణం

చంద్రబాబుకు టిప్పర్ డ్రైవర్ అంటే అంత చులకనా అని ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రశ్నించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ శింగనమల వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులును సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రకటించగా, దీనిపై చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక వృత్తిపై ఆధారపడి కష్టార్జితంతో తమ కుటుంబాన్ని పోషించుకుంటారన్నారు. చంద్రబాబులా స్కీమ్‌ల పేరుతో స్కామ్‌లు చేసి, అడ్డంగా దోచుకుతినే వారుండరని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజంలో ఎవరి ఆత్మాభిమానాన్ని దెబ్బతినేలా వ్యాఖ్యానించినా నేరమే అన్నారు. రాష్ట్రంలో ఉన్న టిప్పర్ డ్రైవర్లందరికీ చంద్రబాబు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

అభివృద్ధిని విస్మరించిన టీడీపీ నాయకులు

రాజమహేంద్రవరాన్ని టీడీపీ నాయకులు భ్రష్టు పట్టించారని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ ధ్వజమెత్తారు. స్థానిక 23వ డివిజన్‌లో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వాకచర్ల కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిసి మద్దతు కోరారు. ఎంపీగా తాను నగరంలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల పాటు అధికారంలో ఉన్న టీడీపీ నాయకులు నగరంలో ఒక్క అభివృద్ధి పనికూడా చేయలేదన్నారు. ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారన్నారు. తాను ఎంపీగా గెలిచిన నగరాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దానన్నారు. దానిని చూడలేకే ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. చంద్రబాబు హయాంలో ఒక్క ప్రభుత్వ మెడికల్ కళాశాల కూడా ఆంధ్రాలో మంజూరు చేయలేకపోయారన్నారు. సీఎం జగనన్న రాష్ట్రంలో ఏకంగా 16 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను శాంక్షన్ చేశారన్నారు. గోదావరి బండ్‌ను హైదరాబాద్ ట్యాంక్ బండ్ కంటే అద్భుతంగా తీర్చిదిద్దుతానని, నగర ప్రజలకు 24 గంటలూ మంచినీటి సరఫరా చేయడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి వేణుగోపాలకృష్ణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: మల్లయ్యపేట గ్రామదేవత దానవాయిబాబు అమ్మవారి ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, మాజీ సర్పంచ్ ఆవంట వెంకట సుబ్బారాయుడు, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు యెజ్జు వాసు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ప్రకాశం నగర్: నగరంలోని లూథర్ గిరి, వాంబే కాలనీ, గాదిరెడ్డి నగర్, ఆనంద్ నగర్, తారక రామన్న నగర్, పద్మావతీ నగర ప్రాంతాలలో తాగునీటి సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ కోరారు. స్థానిక శ్యామల సెంటర్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అరుణ్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని కాతేరు, వెంకటనగరం గ్రామాల్లో సైతం నీటి సమస్య ఉందన్నారు. గోదావరిలో చేస్తున్న ఇసుక అక్రమ డ్రెడ్జింగ్ వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్నాయన్నారు. పార్టీ నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు బి.రాజులోవ, ఎం.సుందర్ బాబు, ఎస్ఎస్ మూర్తి పాల్గొన్నారు.

పేపర్ మిల్లు కార్మికుల నిరసన



పేపర్ మిల్లులో విధులను బహిష్కరించి నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రకాశం నగర్: నూతన వేతన ఒప్పందం అమలు చేయాలని ఆంధ్రా పేపర్ మిల్లు కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మధ్యాహ్నం మిల్లు లోపల పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు బైఠాయించారు. విధులను బహిష్కరించి, యాజమాన్యానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాత వేతన ఒప్పందం 2020 జూన్ 30తో ముగిసిపోయిందని, అప్పటి నుంచి యాజమాన్యం నూతన వేతన ఒప్పందం చేయకుండా తాత్సారం చేస్తోందన్నారు. ఈ విషయంపై నెల రోజుల క్రితం మిల్లులోని 11 రిజిస్టర్డ్ కార్మిక సంఘాలు కలిసి సమ్మె నోటీస్ ఇచ్చాయన్నారు. అనంతరం ఏలూరు కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ వద్ద యాజమాన్యానికి కార్మిక సంఘాలకు జరిగిన చర్చలలో కార్మిక శాఖ అధికారులు, యాజమాన్యం చేసిన సూచన మేరకు 11 సంఘాలు ఉమ్మడిగా వేతన ఒప్పందానికి సంబంధించిన డిమాండ్లు అందజేశామని తెలిపారు. కానీ యాజమాన్యం చర్చలకు పిలిచి వేతన ఒప్పందం చేయలేమని మొండి వైఖరి అవలంబించడంతో మళ్లీ కార్మిక శాఖ అధికారులను ఆశ్రయించామన్నారు. కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ వేతన ఒప్పందం కోసం సూచించినా యాజమాన్యం పెడచెవిన పెట్టడంతో ఆందోళన చేపట్టినట్టు తెలిపారు.

ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు



కె.వెంకటేశ్వరరావు డీఎంఅండ్‌హెచ్‌ఓ

రాజమహేంద్రవరం రూరల్: వేసవిలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వడదెబ్బకు గురయ్యే వారికి సత్వర వైద్యం అందించేందుకు అన్ని పీహెచ్‌సీలు, హెల్త్, వెల్‌నెస్ సెంటర్లలో ఏర్పాట్లు చేశామన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామన్నారు. బస్టాండ్లు, ప్రధాన జంక్షన్లు, వారపు సంతల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీకి పీహెచ్‌సీల వైద్యులు, ఏఎన్ఎంలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో చిన్నపిల్లలు, వృద్ధులను వైద్య సిబ్బంది పరిశీలించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేసి, వినియోగంపై అవగాహన కల్పించాలని తెలిపారు. 108, 104 వాహనాల్లో కూడా పూర్తి స్థాయిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వడదెబ్బకు గురైన వారిని 108 ద్వారా సకాలంలో ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు. వేసవిలో ప్రజలు రక్షిత తాగునీటితో పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అతి తీవ్రమైన ఎండలో పని చేసే రైతులు, వ్యవసాయ కూలీలు, ఇతర కార్మికులు అప్రమత్తంగా ఉండాలని, ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ సురక్షిత ప్రాంతాల్లో విశ్రాంతి తీసుకోవడం మంచిదని పేర్కొన్నారు. తప్పనిసరి అయితే, బహిరంగ ప్రదేశాల్లో గొడుగు వాడాలని, పలుచని తెలుపు రంగు కాటన్ వస్త్రాలు ధరించాలని సూచించారు. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా గ్లూకోజు కలిపిన నీటిని అవసరం మేరకు తాగాలన్నారు. వడదెబ్బకు గురైన వారికి తక్షణం రక్షణ చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆసుపత్రికి తరలించాలని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరరావు సూచించారు.